క్లుప్తంగా

బాల వికాస్‌తో చిన్నారుల్లో నైతిక విలువలు



చిన్నారులకు నైతిక విలువల గురించి చెబుతున్న డాక్టర్ ప్రభాకర్

అమలాపురం టౌన్: సత్యసాయి బాల వికాస్ కేంద్రాల ద్వారా చిన్నారులకు నైతిక విలువలపై అవగాహన పెరుగుతోందని అమలాపురం డివిజన్ శ్రీసత్యసాయి సేవా సంస్థల కోఆర్డినేటర్ డాక్టర్ జి.ప్రభాకర్ అన్నారు. పట్టణంలోని అన్నాబత్తులవారి వీధిలో కొత్తగా ఏర్పాటైన సత్య సాయి బాల వికాస్ కేంద్రాన్ని డాక్టర్ ప్రభాకర్ ఆదివారం ప్రారంభించి ప్రసంగించారు. ఈ సందర్భంగా బాలబాలికలకు నీతి కథలు, నైతిక విలువలపై అవగాహన కల్పించారు. ప్రతి ఆదివారం శిక్షణ కార్యక్రమం ఉంటుందని డాక్టర్ ప్రభాకర్ తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వేసవి వినోదం

అమలాపురం టౌన్: విద్యార్థుల్లో మానసిక వికాసం, విజ్ఞానం కోసం వేసవి వినోదం కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి పి.మురుగేశ్వరరావు అన్నారు. వేసవి వినోద కార్యక్రమాల నిర్వహణపై స్థానిక యూటీఎఫ్ హోమ్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. రిసోర్స్ పర్సన్లు, వలంటీర్లు, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయుల సహకారంతో త్వరలో వేసవి వినోద కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. సమావేశంలో జన విజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి జె.సత్యనారాయణ, యూటీఎఫ్ మహిళా ప్రతినిధి చంద్రకళ, పట్టణ ఐద్వా అధ్యక్ష, కార్యదర్శులు మహ్మద్ హమీద్ దున్నీషా, టి.నాగ వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నిజ జీవితంలోనూ పునీత్ రాజ్‌కుమార్ హీరోయే

అమలాపురం టౌన్: కన్నడ హీరో పునీత్‌కుమార్ సినిమాల్లోనే కాకుండా మానవతావాదిగా ఎన్నో సేవలు చేసి నిజ జీవితంలోనూ హీరోగా నిలిచారని ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు అన్నారు. స్థానిక సూర్య నగర్‌లోని మానవతా కళా ప్రాంగణంలో ఆదివారం నిర్వహించిన హీరో పునీత్‌కుమార్ 49వ జయంతి వేడుకల్లో ఎమ్మెల్సీ వెంకటేశ్వరరావు పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా పునీత్ రాజ్‌కుమార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డాక్టర్ రాయుడు శ్రీరామచంద్రమూర్తి, హైకోర్టు న్యాయవాది ముషిణి రామకృష్ణారావు, మామిడిశెట్టి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌పీఐ అభ్యర్థిగా రిటైర్డ్ మెజిస్ట్రేట్ రామకృష్ణ



రామకృష్ణను అభినందిస్తున్న పార్టీ నాయకులు

ముమ్మిడివరం: భారత రిపబ్లికన్ పార్టీ ముమ్మిడివరం నియోజకవర్గ అసెంబ్లీ అభ్యర్థిగా విశ్రాంత న్యాయమూర్తి దడాల రామకృష్ణను, అమలాపురం పార్లమెంట్ అభ్యర్థిగా గడ్డి జ్ఞానప్రకాష్‌ను పార్టీ అధిష్ఠానం ప్రకటించింది. ఈ మేరకు స్థానిక బుద్ధా పార్కులో ఆదివారం జరిగిన ఆర్‌పీఐ కార్యకర్తల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన రాష్ట్ర అధ్యక్షుడు ఎస్‌ఎం బుషి మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో మతతత్వ, కులతత్వ పార్టీలను ఓడించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో బళ్ల సత్యనారాయణ, చీకటిమల్లి శ్రీనివాస్, పి.సుధీర్, బుడితి శరత్‌బాబు, సాహిసి బాలయోగి పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడిపై చర్యలు తీసుకోవాలి

యానాం: నియోజవర్గ పరిధిలో తాగు, సాగునీటి ఎద్దడి తలెత్తకుండా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని ఆర్‌ఏఓ మునిస్వామికి పుదుచ్చేరి సీఎల్పీ నేత, ఎమ్మెల్యే వైద్యనాథన్ విజ్ఞప్తి చేశారు. ఆదివారం స్థానిక ఆర్‌ఏఓ చాంబర్‌లో తాగునీటి ఎద్దడి, శివారు పొలాలకు నీరందక రైతుల ఇబ్బందులు, ప్రభుత్వ ఆసుపత్రిలో మార్చురీ విభాగం, సీటీ స్కానింగ్, ఎక్స్‌రే యంత్రం, జనరేటర్ తదితర వసతులు లేకపోవడం వల్ల రోగుల ఇబ్బందుల తదితర సమస్యలపై చర్చించారు. కార్యక్రమంలో మల్లాడి సత్తిబాబు, కాటంశెట్టి రామ్మూర్తి, బంగారం, పెరుమాల్, చక్రవర్తి, మున్నా, గణేష్‌లు పాల్గొన్నారు.

జెడ్పీటీసీ సభ్యురాలి పరామర్శ

అల్లవరం: ప్రముఖ కవి సవేరా(సరెళ్ల వెంకటరత్నం) భార్య సీతారత్నం(75) శనివారం తెల్లవారుజామున అమలాపురం వెంకటకృష్ణాపురం కాలనీలో మృతి చెందారు. అల్లవరం జెడ్పీటీసీ సభ్యురాలు కొనుకు గౌతమి, వైఎస్సార్‌సీపీ మండల పార్టీ అధ్యక్షుడు కొనుకు బాపూజీలు ఆదివారం సవేరాను పరామర్శించి సంతాపం తెలిపారు. వారి వెంట ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు బంగార్రాజు, కార్యదర్శి నకుల రాజు, బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా కార్యదర్శి భూపతి, సీనియర్ న్యాయవాది ఎస్‌ఎం బుషి తదితరులున్నారు.

పది పరీక్షకు సర్వం సిద్ధం

- పరీక్షా కేంద్రాల్లో అందుబాటులో మంచినీరు
- లైట్లు, ఫ్యాన్లు పని చేసేలా ముందు జాగ్రత్త చర్యలు
- ప్రతి గదిలో 24 మంది విద్యార్థులు మించకుండా ఏర్పాట్లు



గొల్లవిల్లిలో పదో తరగతి పరీక్షపై ఇన్విజిలేటర్లకు అవగాహన కల్పిస్తున్న డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్ వెంకటేశ్వరరావు

మండలం	పరీక్ష కేంద్రాలు	హాజరుకానున్న విద్యార్థులు
అమలాపురం	11	2100
అల్లవరం	4	920
ఉప్పలగుప్తం	4	586
ముమ్మిడివరం	5	810
కాట్రేనికోన	3	660
ఐ.పోలవరం	4	790
తాళ్లరేవు	5	1265

ఉప్పలగుప్తం: విద్యార్థి దశలో ఎంతో కీలకమైన పదో తరగతి పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. పదో తరగతి పరీక్షల్లో తెచ్చుకున్న మార్కుల ఆధారంగా ఉన్నత చదువులకు అడుగులు పడతాయి. ఈ నెల 18 నుంచి 27వ తేదీ వరకూ పది పరీక్షలు జరగనున్నాయి. పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులు ఎలాంటి ఇబ్బందులకు గురి కాకుండా విద్యార్థులకు అవసరమైన అన్ని వసతులను సమకూర్చారు. ప్రతి తరగతి గదిలో బల్లలు, లైట్లు, ఫ్యాన్లు సక్రమంగా పనిచేసేలా ముందు జాగ్రత్త చర్యలు తీసుకున్నారు. అలాగే ఎటువంటి మాస్ కాపీయింగ్‌కు ఆస్కారం లేకుండా అధికార యంత్రాంగం చర్యలు చేపట్టింది. ప్రతి తరగతి గదికి 24 మంది విద్యార్థులకు మించకుండా ఏర్పాట్లు చేశారు. పరీక్షా కేంద్రాలు దూరంగా ఉన్న విద్యార్థుల కోసం దగ్గరలోనే నూతనంగా పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. వేసవి రీత్యా ప్రతి రెండు తరగతి గదులకు విద్యార్థులకు అందుబాటులో మట్టి కుండలో చల్లటి మంచి నీటిని అందుబాటులో ఉంచుతున్నారు. పరీక్షా కేంద్రాల్లో విద్యార్థుల కోసం వైద్య సిబ్బందిని నియమించారు.

ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ అవసరం

పదో తరగతి పరీక్షలు అనగానే కొందరు విద్యార్థులు రేయింబవళ్లు చదివి ఆలస్యంగా నిద్ర పోవడంతో ఆరోగ్యం క్షీణించే ప్రమాదముంది. ఈ విషయాన్ని పరిగణలోకి తీసుకుని రోజూ విద్యార్థులు నిద్రకు తగిన ప్రాధాన్యమివ్వాలని వైద్యులు చెబుతున్నారు. అలాగే ఏది పడితే అది తినకుండా త్వరగా అరుగుదలకు వచ్చే వంటకాలను, పండ్లను తీసుకోవాలని, మంచినీరు ఎక్కువగా తీసుకోవాలని సూచిస్తున్నారు. అక్షరాలు గుండ్రంగా ఉంటే చేతి రాతతో మంచి మార్కులు సాధించవచ్చని ఉపాధ్యాయులు చెబుతున్నారు.

పూర్తి ఏర్పాట్లు చేశాం



పరీక్ష రాసే విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ప్రతి పరీక్ష కేంద్రంలో పక్కాగా ఏర్పాట్లు చేశాం. విద్యార్థులు రోజూ ఉదయం 8.30 గంటలకే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలి. పరీక్షకు వచ్చేటప్పుడు హాల్ టికెట్, రెండు పెన్నులు, స్కేలు, పరీక్ష అట్టను తమతో తెచ్చుకోవాలి. పరీక్షపై ఉన్నతాధికారుల పర్యవేక్షణ కొనసాగుతుంది.

– సత్తి సత్యకృష్ణ, ఎంఈవో–2, ఉప్పలగుప్తం మండలం

ప్రతి మార్కు ముఖ్యమే



విద్యార్థులు ప్రతి మార్కు ముఖ్యమే అన్నది మరిచిపోకూడదు. ప్రశ్నాపత్రం అందించగానే ఒకటికి రెండు సార్లు క్షుణ్ణంగా పరిశీలించాలి. ప్రతి జవాబుకు మార్జిన్ బయట ప్రశ్న నంబరు తప్పనిసరిగా వేయాలి. చేతి రాతకు ప్రాధాన్యమిస్తే మంచిది. వ్యాసరూప ప్రశ్నలకు ఉప శీర్షిక, పదానికి పదానికి మధ్య దూరం ఉండేలా చూసుకోవాలి.

– కేసీహెచ్ విశ్వనాథ్, తెలుగు ఉపాధ్యాయుడు, సీహెచ్ గున్నేపల్లి, ముమ్మిడివరం మండలం

కామిశెట్టికి మంత్రి అభినందనలు



శ్రీనివాసరావును సత్కరిస్తున్న మంత్రి విశ్వరూప్

అమలాపురం రూరల్: వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమితులైన బండారులంక గ్రామానికి చెందిన కామిశెట్టి శ్రీనివాసరావును రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ అభినందించారు. భట్నవిల్లిలో మంత్రి విశ్వరూప్‌ను కామిశెట్టి శ్రీనివాసరావు బండారులంకకు చెందిన చేనేత సంఘం నాయకులతో వెళ్లి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావును మంత్రి విశ్వరూప్ సత్కరించారు. తనకు పదవి ఇచ్చినందుకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, మంత్రి విశ్వరూప్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. మంత్రిని కలిసినవారిలో వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి సరెళ్ల రామకృష్ణ, వైఎస్సార్ సీపీ చేనేత విభాగం అధ్యక్షుడు కాలేపు శ్రీనివాస్, వైఎస్సార్ సీపీ చేనేత విభాగం రాష్ట్ర కార్యదర్శి జాన గణేష్, పీఎంసీ చైర్మన్ పేదపూడి బాబూరావు, చేనేత సొసైటీ చైర్మన్ చింతా ఉమామహేశ్వరరావు తదితరులున్నారు.

విశ్వరూప్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపిస్తాం



మంత్రి విశ్వరూప్‌ను సత్కరిస్తున్న ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు



మంత్రి విశ్వరూప్‌ను సత్కరించిన పట్టణ విశ్వబ్రాహ్మణులు, స్వర్ణకారులు

అమలాపురం రూరల్: రానున్న ఎన్నికల్లో రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపిస్తామని ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు అన్నారు. వైఎస్సార్ సీపీ అమలాపురం నియోజకవర్గ అభ్యర్థిగా విశ్వరూప్‌ను ప్రకటించిన సందర్భంగా భట్నవిల్లిలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో మంత్రి విశ్వరూప్‌ను ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛంతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, నాయకులు, ప్రజల సహకారంతో మంత్రి గెలుపునకు సమష్టిగా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు మట్టపర్తి నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

విశ్వ బ్రాహ్మణుల అభినందన

అమలాపురం టౌన్: అమలాపురం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా మంత్రి విశ్వరూప్‌ను పార్టీ అధిష్ఠానం ప్రకటించడంతో పట్టణంలోని విశ్వ బ్రాహ్మణులు, స్వర్ణకారులు ఆదివారం మంత్రి క్యాంపు కార్యాలయానికి వెళ్లి ఆయనకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి విశ్వరూప్‌ను పూలమాలలతో సత్కరించారు. మూడోసారి అమలాపురం నుంచి ఎమ్మెల్యేగా విజయం సాధిస్తారని ఆకాంక్షించారు. మంత్రిని కలిసినవారిలో పట్టణ స్వర్ణకార సంఘం అధ్యక్షుడు భరణికాన బాబు, కార్యదర్శి ఓడూరి ఫణీంద్రకుమార్, రాష్ట్ర విశ్వ బ్రాహ్మణ సంఘం గౌరవాధ్యక్షుడు కట్టోజు సన్న్యయ్యదాసు, తాళాబత్తుల లక్ష్మణరావు, కట్టోజు రాము తదితరులున్నారు.

రాపాకను కలిసిన అల్లవరం పార్టీ శ్రేణులు



ఎంపీ అభ్యర్థి రాపాక వరప్రసాదరావును కలిసి శుభాకాంక్షలు తెలుపుతున్న అల్లవరం పార్టీ శ్రేణులు

అల్లవరం: అమలాపురం వైఎస్సార్ సీపీ పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థిగా ఎంపికైన రాపాక వరప్రసాదరావుని అల్లవరం మండల వైఎస్సార్ సీపీ శ్రేణులు రాజోలులోని ఆయన నివాసంలో ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. సార్వత్రిక ఎన్నికల్లో పార్టీ విజయానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వైఎస్ ఎంపీపీ వడ్డి గంగ, ఎంపీటీసీలు గుబ్బల రంగనాథస్వామి, మాకే కృష్ణమూర్తి, పులుసుగంటి రాజేశ్వరి, బస్వాని పద్మ, దొమ్మేటి సురేష్, కర్రి శ్రీను తదితరులు పాల్గొన్నారు. అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థి పినిపే విశ్వరూప్‌ను సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు సాధనాల వెంకటరావు అమలాపురంలోని ఆయన నివాసంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. సార్వత్రిక ఎన్నికల్లో విశ్వరూప్ మరో మారు ప్రభంజనం సృష్టిస్తారన్నారు. ఆయన వెంట కుడుపూడి ప్రకాశరావు, కాశి బాలయోగి, పినిమాల విక్రమ్ పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శిగా బుజ్జి



బొడ్డు నాగేశ్వరరావును అభినందిస్తున్న మంత్రి విశ్వరూప్

ఉప్పలగుప్తం: మండలంలోని ఎస్.కొత్తపల్లి గ్రామానికి చెందిన సీనియర్ నాయకుడు బొడ్డు నాగేశ్వరరావు(బుజ్జి)వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శిగా నియమితులయ్యారు. ఈ మేరకు ఆయనకు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నుంచి ఉత్తర్వులు అందాయి. ఈ సందర్భంగా నాగేశ్వరరావును రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ తన క్యాంపు కార్యాలయంలో ఆదివారం దుశ్శాలువా కప్పి అభినందించారు. రానున్న ఎన్నికల్లో పార్టీ విజయానికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు నడింపల్లి వాసురాజు, లంకే సూరిబాబు, శ్రీను, కోలా కృష్ణ, అంగాని రాంబాబు, ఓలేటి అచ్చిబాబు పాల్గొన్నారు.

వైభవంగా పోలేరమ్మ ఆలయ వార్షికోత్సవం



పోలేరమ్మ అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

తాళ్లరేవు: మండలంలోని పోలేకుర్రు గ్రామదేవత పోలేరమ్మ అమ్మవారి ఆలయ 18వ వార్షికోత్సవం ఆదివారం అత్యంత వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా ఆలయాన్ని పూలమాలలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. వేద పండితులు మర్ల ఫణిశర్మ బృందం ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి క్షీరాభిషేకం చేశారు. అనంతరం వేదపండితులు కందికొండ బాబి, చావలి రవి, కందికొండ చందు తదితరుల నేతృత్వంలో అమ్మవారికి మహిళలచే సామూహిక కుంకుమ పూజలు చేయించారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భారీ అన్నసమారాధన నిర్వహించారు. పోలేకుర్రు, తాళ్లరేవు, మల్లవరం, సుంకటరేవు, ప్రత్తిగొంది, జార్జిపేట, యానాం తదితర గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమాలను ఆలయ కమిటీ ప్రతినిధులు పోతుల చక్రేశ్వరరావు, పుప్పాల శ్రావణకుమార్, గంగిరెడ్డి రాము, పోతుల వీరేంద్ర, చరణ్ తదితరులు పర్యవేక్షించారు.

లోక్‌సభ ఎన్నికకు విస్తృత ఏర్పాట్లు



సమావేశంలో మాట్లాడుతున్న అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి మునిస్వామి

యానాం: పుదుచ్చేరి పార్లమెంట్ స్థానానికి ఏప్రిల్ 19న జరగనున్న ఎన్నికలకు విస్తత ఏర్పాట్లు చేస్తున్నట్లు అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి మునిస్వామి తెలిపారు. ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ నియోజకవర్గంలో మొత్తం 39,390 మంది ఓటర్లు ఉన్నారని, వారిలో పురుషులు 19,016 మంది, మహిళలు 20,374 మంది ఉన్నారన్నారు. మొత్తం 33 పోలింగ్ స్టేషన్‌లను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. నియోజకవర్గాన్ని ఏడు సెక్టార్లుగా విభజించి 24 గంటలూ తిరిగే మూడు ఫ్లైయింగ్ స్క్వాడ్లు, సమావేశాలను పరిశీలించేందుకు వీడియో సర్వైలెన్స్ టీమ్స్ ఏర్పాటు చేశామన్నారు. యానాం–ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల సరిహద్దుల్లో 10 ఎక్సైజ్ చెక్‌పోస్టులు పెడుతున్నట్లు చెప్పారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల ప్రకారం నియోజకవర్గ పరిధిలో 85 ఏళ్లకు పైబబడిన వృద్ధులు, 40 శాతానికి పైగా అవయవ లోపం ఉన్నవారి ఇంటి వద్దకే బ్యాలెట్ పేపర్లు, బ్యాలెట్ బాక్సులు ఎన్నికల సిబ్బంది పట్టుకెళ్లి ఓటు వేయిస్తారన్నారు. మార్చి 16న ఎన్నికల ప్రకటన, 20న గెజిట్ నోటిఫికేషన్, మార్చి 27న నామినేషన్లకు ఆఖరుతేదీ, 28న నామినేషన్ల పరిశీలన, 30న నామినేషన్ల ఉపసంహరణ ఉంటుందన్నారు.

బొంతు శ్రీనివాసరావుకు సత్కారం



బొంతు శ్రీనివాసరావును సత్కరిస్తున్న బీసీ సంఘ నాయకులు

తాళ్లరేవు: రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం ప్రచార కార్యదర్శిగా ఎంపికైన బొంతు శ్రీనివాసరావును ఘనంగా సత్కరించారు. సుంకరపాలెం పంచాయతీ చింతాకులవారిపేట గ్రామంలో బీసీ నాయకుడు బొంతు సత్యనారాయణ అధ్యక్షతన శ్రీనివాసరావు అభినందన సభ ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేశన శంకరరావు మాట్లాడుతూ బీసీలకు రాజ్యాధికారం వస్తేనే వాళ్ల జీవితాల్లో మార్పులు వస్తాయన్నారు. జనాభాలో 60 శాతంగా ఉన్న బీసీలు 10 శాతంగా ఉన్న అగ్ర కులాలకు ఓట్లు వేసుకునే పరిస్థితి ఉందన్నారు. కార్యక్రమంలో చొల్లంగి వేణుగోపాల్, కుడుపూడి శివన్నారాయణ, కాదా గోవిందకుమార్, టిళ్లపూడి నాగేశ్వరరావు, కుమ్మర్ల క్రాంతికుమార్, రాయుడు నాగేశ్వరరావు, బొంతు ఏడుకొండలు, రాయుడు చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా పంచముఖి ఆంజనేయ వాహనోత్సవం



పంచముఖ ఆంజనేయుని వాహనం

యానాం: పట్టణంలో కొలువైన భూసమేత వేంకటేశ్వరస్వామి(మీసాల వెంకన్న) కల్యాణోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి భూపతిరాజు సీతామహాలక్ష్మి, వీర్రాజు దంపతులు ఉత్సవదారులుగా పంచముఖ ఆంజనేయ వాహనోత్సవం వైభవంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం పురవీధుల్లో స్వామివారి వాహనాన్ని ఊరేగించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి.

వైఎస్సార్ సీపీ రాష్ట్ర విద్యార్థి విభాగం కార్యదర్శిగా రాజా

అమలాపురం టౌన్: వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధిష్ఠానం రాష్ట్ర ప్రధాన కమిటీతో పాటు పలు విభాగాలకు జిల్లా నుంచి ఇప్పటికే ఎనిమిది మంది పార్టీ నేతలను పలు పదవుల్లో నియమించింది. తాజాగా పార్టీ రాష్ట్ర విద్యార్థి విభాగం కార్యదర్శిగా జిల్లాకు చెందిన పార్టీ నాయకుడు వింటి యేసురాజు (రాజా)ను నియమించింది. పార్టీ అధినేత, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం ఈ నియామకం చేసింది.

టిప్పర్ ఢీకొని వ్యక్తి మృతి

తాళ్లరేవు: జాతీయ రహదారి–216లోని కోరంగి వంతెన దిగువన ఆదివారం రాత్రి యానాం నుంచి కాకినాడ వైపు వెళుతున్న ద్విచక్ర వాహనాన్ని కాకినాడ నుంచి యానాం వైపు వస్తున్న టిప్పర్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ద్విచక్రవాహనంపై ప్రయాణిస్తున్న గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందగా మరో ఇద్దరు తీవ్ర గాయాల పాలయ్యారు. మృతి చెందిన వ్యక్తి ఎవరో తెలియలేదని కోరంగి ఎస్‌ఐ రవికుమార్ తెలిపారు. గాయపడినవారు మాత్రం కాకినాడకు చెందిన సురేష్, నానిలుగా గుర్తించామన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు వాడపాలెం విద్యార్థులు

కొత్తపేట: అనకాపల్లిలో ఈ నెల 25 న జరిగే రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు కొత్తపేట మండలం వాడపాలెం విద్యార్థులు బి.మేఘన, వి.సారిక, వి.శ్రావణి, జి.నందిని, ఎస్.మోక్ష, జి.నిఖిల, ఎం.హేమదీక్షిత, జి.అఖిల, ఎం.అనిష్కవిద్య ఎంపికైనట్టు స్థానిక వివేకానంద యోగా ఆశ్రమం నిర్వాహకుడు ఆకుల శ్రీనివాస్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల అమలాపురం కామాక్షి పీఠంలో జరిగిన యోగా పోటీల్లో ప్రతిభను కనబరచి రాష్ట్ర పోటీలకు ఎంపికయ్యారని శ్రీనివాస్ పేర్కొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కు అందజేత

ఉప్పలగుప్తం: మండలంలో గొల్లవిల్లి గ్రామానికి చెందిన నాగిరెడ్డి వెంకటరమణ అనారోగ్యం కారణంగా ఇటీవల ఊపిరితిత్తులకు సంబంధించి చికిత్స తీసుకున్నారు. ఈ నేపథ్యంలో ఆయనకు సీఎం సహాయ నిధి నుంచి రూ.47,000 చెక్కు మంజూరైంది. వెంకటరమణ కుమారుడు శివకు సదరు చెక్కును రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో గొల్లవిల్లి గ్రామ వైఎస్సార్ సీపీ కార్యదర్శి సలాది శివాజీ తదితరులు పాల్గొన్నారు.

విగ్రహాలకు ముసుగులు



అమలాపురంలో నేతల విగ్రహాలకు వేసిన ముసుగులు

అమలాపురం రూరల్: ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో అధికారులు ఆదివారం అప్రమత్తమై రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగులు వేశారు. గ్రామాల్లో రాజకీయ నాయకులకు సంబంధించిన ఫ్లెక్సీలను తొలగించారు. అంబేడ్కర్, గాంధీజీ విగ్రహాలు మినహా రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగులు వేయాలని గ్రామ పంచాయతీ సిబ్బందికి మండల ఎన్నికల అధికారులు ఆదేశాలు ఇచ్చారు. అలాగే ప్రభుత్వ కార్యాలయాల్లో రాజకీయ నాయకుల ఫొటోలు, ఫ్లెక్సీలు తొలగించాలని సూచించారు.

ఎన్నికల నిబంధనలు కచ్చితంగా పాటించాలి

అల్లవరం: ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన నేపథ్యంలో మండలంలోని అన్ని గ్రామాల్లో ఎన్నికల నిబంధనలు కచ్చితంగా పాటించాలని ఎంపీడీఓ కృష్ణమోహన్ కార్యదర్శులను ఆదేశించారు. ఆదివారం ఆయన మండలంలోని వివిధ గ్రామాల్లో ఫ్లెక్సీల తొలగింపు, రాజకీయ నేతల విగ్రహాలకు ముసుగుల ఏర్పాటును పరిశీలించారు. మండలంలోని 55 విగ్రహాలకు ముసుగులు ఏర్పాటు చేశామని, 308 బ్యానర్లు తొలగించామని చెప్పారు.

చల్లపల్లిలో సినీ సందడి

ఉప్పలగుప్తం: మండలంలోని చల్లపల్లి, ఎస్.యానాం గ్రామాల్లో అవును నిజమే సినిమా షూటింగ్‌తో సందడి నెలకొంది. సత్యశ్రీ క్రియేషన్ బ్యానర్‌పై చల్లపల్లి గ్రామానికి చెందిన వరసాల సత్యనారాయణ ఈ సినిమాని రూపొందిస్తున్నారు. సినిమాలో హీరోగా సత్యనారాయణ, హీరోయిన్‌గా అనూష నటిస్తుండగా సంగీతం దర్శకుడిగా రాజేష్, కొరియోగ్రాఫర్‌గా బండ్ల రామారావు, పాటల రచయితగా పవన్ శంకర్ పనిచేస్తున్నారని నిర్మాత సత్యనారాయణ చెప్పారు. ఏప్రిల్ మూడో వారంలో ఆడియో విడుదల చేసి, మేలో ప్రేక్షకుల ముందుకు సినిమాని తీసుకొస్తామని తెలిపారు.

అభ్యర్థుల ఎంపికపై వీడని ఉత్కంఠ

యానాం: పుదుచ్చేరి ఏకైక లోక్‌సభ స్థానానికి ఏప్రిల్ 19న జరగనున్న ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులను రాజకీయ పార్టీలేవీ ఇప్పటి వరకూ అధికారికంగా ప్రకటించకపోవడం ఉత్కంఠను రేపుతుంది. ఈ ఎన్నికల్లో ఎన్‌ఆర్ కాంగ్రెస్, బీజేపీ కూటమి, అదేవిధంగా కాంగ్రెస్, డీఎంకే కూటమితో పాటు ఏఐడీఎంకే సైతం తమ అభ్యర్థులను నిలపనుండడంతో త్రిముఖ పోటీ నెలకొంది. అయితే సామాజిక మాధ్యమాల్లో ఊహాగానాలే తప్ప అధికారికంగా ఏ పార్టీ అభ్యర్థిని ప్రకటించలేదు. దీంతో టికెట్ కోసం ఎదురుచూస్తున్న వారంతా ఏం జరుగుతుందోనని మల్లగుల్లాలు పడుతున్నారు.

బీసీ ఉద్యోగులకు సత్కారం



ఉద్యోగులను సత్కరించిన జిల్లా బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం ప్రతినిధులు

అమలాపురం టౌన్: జిల్లాలో పదవీ విరమణ చేసిన తొమ్మిది మంది బీసీ ఉపాధ్యాయులు, పదోన్నతి పొందిన ఒక ఉపాధ్యాయురాలిని స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఆదివారం సాయంత్రం సత్కరించారు. జిల్లా బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో అధ్యక్షుడు గుబ్బల మురళీకృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అమలాపురం సత్య నేత్రాలయం ప్రతినిధి, విశ్రాంత సీబీ సీఐడీ ఉద్యోగి కదలి సత్యనారాయణ పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమంలో గుత్తుల వీరబ్రహ్మం, ఎస్.రాజరాజేశ్వరి, విత్తనాల శ్రీనివాస్, పెచ్చెట్టి శ్రీనివాస్, బొక్కా వెంకటేశ్వరరావు, దొమ్మేటి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పదో తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

తాళ్లరేవు: మండల పరిధిలోని తాళ్లరేవు, పటవల, పి.మల్లవరం, ఇంజరం జెడ్పీ హైస్కూళ్లతో పాటు తాళ్లరేవు జూనియర్ కళాశాలలో పదో తరగతి పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు మండల విద్యాశాఖాధికారి మోకా ఉమ తెలిపారు. పాత కేంద్రాలతో పాటు ఈ ఏడాది కొత్తగా పి.మల్లవరం జిల్లా పరిషత్ హైస్కూల్‌లోనూ పరీక్షా కేంద్రం ఏర్పాటుచేశామన్నారు. మండలవ్యాప్తంగా మొత్తంగా 1265 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారని, వారిలో 592 మంది బాలురు, 673 మంది బాలికలు ఉన్నారన్నారు.

పార్టీ అవకాశమిస్తే పోటీ చేస్తా

అమలాపురం రూరల్: పార్టీ అవకాశమిస్తే రానున్న ఎన్నికల్లో బీజేపీ తరఫున అమలాపురం పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థిగా పోటీ చేయడానికి సిద్ధంగా ఉన్నానని కొమానపల్లి గ్రామానికి చెందిన కావూరు మధుసూదన్‌రావు ఆదివారం విలేకర్లకు తెలిపారు.